జేకేసీ.. దిక్సూచి

- క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ
- జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా శిక్షణ
- నైపుణ్యాలు, ఉద్యోగాల సాధనే లక్ష్యం



క్యాంపస్ డ్రైవ్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన మహిళా కళాశాల విద్యార్థినులు



జేకేసీ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



గ్రూప్ డిస్కషన్‌లో విద్యార్థినులు

డాబాగార్డెన్స్: పాత జైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపుతున్నారు. ఈ కాలేజీలో ఏర్పాటు చేసిన జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ద్వారా వీరు శిక్షణ పొందుతూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాల సాధనకు అనుగుణంగా విద్యార్థినులను జేకేసీ తీర్చిదిద్దుతూ దిక్సూచిగా నిలుస్తోంది. లాగ్వేంజ్ లెర్నింగ్, రీజనింగ్, ప్రాక్టీస్, గ్రూప్ డిస్కషన్స్ వంటి శిక్షణ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడం, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచడం వంటివి చేస్తూ వారిని ఉన్నత విద్యావంతులుగా మార్చడంతోపాటు ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తోంది. మహిళా కళాశాలలో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ.. విద్యార్థినులు ఉద్యోగులుగా మారుస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని జేకేసీ పెంపొందిస్తోంది.

ఎంతో మంది విద్యార్థినులకు ఉద్యోగాలు



మా కళాశాలలో ఎంతో మంది విద్యార్థినులకు ఉద్యోగావకాశాలు కల్పించాం. జవహర్ నాలెడ్జ్ సెంటర్ శిక్షణ ద్వారా విద్యార్థినులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. కళాశాలల్లో నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థినులు ఉద్యోగాలు సాధించేందుకు జేకేసీ ఎంతగానో తోడ్పడుతోంది. – డాక్టర్ ఆర్.మంజుల, ప్రిన్సిపాల్, విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల

అన్ని విధాల ప్రోత్సాహం



కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు ఆప్టిట్యూడ్ నేర్పిస్తున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు జేకేసీ ద్వారా తెలుసుకుంటున్నాం. ఇంగ్లిష్ మేడమ్ పద్మప్రియ అన్ని విధాల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. – డి.రుచిత, డిగ్రీ విద్యార్థిని

వివిధ భాషలపై అవగాహన



కళాశాల జేకేసీ ల్యాబ్‌లో విద్యార్థినులకు వివిధ భాషలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగాల సాధనకు తగిన శిక్షణ ఇస్తున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలు, జాబ్‌మేళాల్లో అడిగే ప్రశ్నలకు సరైనా సమాధానాలు చెప్పేట్టుగా విద్యార్థులను తయారు చేస్తున్నారు. – జి.ఎస్.ప్రత్యూష, బీఎస్సీ మైక్రోబయాలజీ

ఉద్యోగాల సాధనపై శిక్షణ



జేకేసీలో ఉద్యోగావకాశాలపై శిక్షణ ఇస్తున్నారు. భాషపై ప్రేమ, ఆప్యాయత పెంచేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఉద్యోగాల సాధనపై ప్రత్యేక శిక్షణ ఇస్తూ.. ఉద్యోగం ఎలా పొందాలనే వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. – పి.సాయిప్రత్యూష, బీఎస్సీ ఎంబీసీ

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం

విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేశాను. కళాశాలలోని జేకేసీ ద్వారా శిక్షణ పొందాను. ఇంగ్లిష్ అధ్యాపకులు ఇచ్చిన శిక్షణ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం పొందాను. ఫలితంగా జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఇండియన్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్‌కు ఎంపికయ్యా. చాలా ఆనందంగా ఉంది. – సిహెచ్.రాజ్యలక్ష్మి, కళాశాల పూర్వ విద్యార్థిని

అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణం ఆపాలి

డాబాగార్డెన్స్: గాజువాక పెదగంట్యాడ వద్ద జనావాసాల మధ్య అదానీ సంస్థ అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ఈ ప్రతిపాదనను రద్దు చేయాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానించేందుకు వెంటనే సమావేశం నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందన్నారు. అదానీ సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం ప్రాంతాలు మొత్తం ప్రమాదకరమైన దుమ్ము, ధూళి విషకణాలతో నిండిపోతాయని, తాగునీరు కాలుష్యమవుతుందని, ప్రజలు అనేక ప్రాణాపాయ జబ్బులకు గురవుతారని పేర్కొన్నారు. జీవీఎంసీకి సరఫరా అయ్యే తాగునీరు, ఏలేరు కెనాల్, నీటి రిజర్వాయర్లు విషకాలుష్యమవుతాయన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ పౌరుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. తక్షణమే ఎటువంటి జాప్యం లేకుండా జీవీఎంసీ కౌన్సిల్, రాజకీయ పక్షాల ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని గంగారావు విజ్ఞప్తి చేశారు. నగర ప్రథమ పౌరుడిగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరారు.

గడువులోగా వినతులు పరిష్కరించాలి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతులను పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి తొమ్మిది వినతులను స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేశారు.

క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: సూర్యాబాగ్‌లోని జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అర్జీదారుల నుంచి నాలుగు వినతులు స్వీకరించారు. పబ్లిక్ హెల్త్‌కు 1, రెవెన్యూకు 2, టౌన్ ప్లానింగ్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

జోన్-5కు మూడు అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. రెవెన్యూ విభాగానికి 2, టౌన్ ప్లానింగ్ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఆర్ఐ కాకర శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, పబ్లిక్ హెల్త్ ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జనార్దనరావు, సూపరింటెండెట్లు వెంకటరమణ, రాజు, పీఆర్‌వో శేఖర్‌బాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుకాణాల సీజ్



31వ వార్డులో దుకాణాలను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

జగదాంబ: అద్దె బకాయిలు చెల్లించని దుకాణాలను జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. 31వ వార్డులోని జీవీఎంసీ వాణిజ్య సముదాయాలపై సోమవారం రెవెన్యూ అధికారి సీతారామయ్య సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పన్నులు చెల్లించని దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య సముదాయాలకు సంబంధించి బకాయిలు పేరుకుపోయాయన్నారు. వీటిపై దుకాణ యాజమానులకు అనేక సార్లు నోటీసులు ఇచ్చామని, స్పందించకపోవడంతో దుకాణాలు సీజ్ చేశామని తెలిపారు. యజమానులు బకాయిలు చెల్లించి సీజ్ చేసిన దుకాణాలను తెరిపించుకోవాలన్నారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న నిమ్మకాయల శ్రీనివాసరావు

మహారాణిపేట: జీవీఎంసీ 38వ వార్డులోని కనకమహాలక్ష్మి దేవస్థానం, విక్టోరియా ఘోష హాస్పిటల్, నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు, ఇంటర్నేషనల్ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మకాయల శ్రీనివాసరావు సోమవారం కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడి టవర్ వల్ల చర్మ వ్యాధులు, గుండె జబ్బులు సోకే ప్రమాదముందని కలెక్టర్‌కు వివరించారు. అధికారులు తక్షణమే స్పందించి సెల్ టవర్‌ను తొలగించాలని, లేని పక్షంలో స్థానికులతో కలిసి ఆందోళన చెపడతామని శ్రీనివాసరావు హెచ్చరించారు.

కేజీహెచ్‌లో విద్యార్థినులకు హోం మంత్రి పరామర్శ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఏకలవ్య బాలికల గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను హోంమంత్రి అనిత సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారని, వైద్యు నిపుణులతో ఒక కమిటీ వేశామని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల మరణం దారుణం



కేజీహెచ్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మహారాణిపేట: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో గిరిజన బాలికలు పచ్చకామెర్ల బారిన పడటం దురదృష్టకరమని, ఇద్దరు చనిపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు చనిపోయినట్లు మంత్రి ప్రకటించలేదని, చనిపోయిన బాలికల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పిల్లల ఆరోగ్యం గురించి సోమవారం సీపీఐ నాయకులతో కలిసి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. బాత్ రూమ్స్, పరిసరాలు బాగోలేని కారణంగా పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోందన్నారు. ఆస్పత్రిలో చేరిన పిల్లల కుటుంబాలకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, ఎం.పైడిరాజు, కేజీహెచ్ ఏఐటీయూసీ నాయకులు జేడీ నాయుడు, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, ఎస్.నాగభూషణం, సీఎస్ క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రైవేటీకరణ అన్యాయం

కేజీహెచ్ వద్ద మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ప్రైవేటు వారికి అప్పగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తుందో చెప్పాలన్నారు. ముందుగా సీఎం చంద్రబాబు తన మైండ్‌సెట్ మార్చుకోవాలని హితవు పలికారు. విద్యా వ్యవస్థను గాలికొదిలేస్తున్నారని, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇస్తున్నారని, ఇంకొన్నేళ్లు ఆయన సీఎంగా ఉంటే ప్రభుత్వమే ప్రైవేట్‌పరం అయిపోతుందని ఎద్దేవా చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శిస్తున్న పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి లక్ష్మి

మహారాణిపేట: పచ్చకామెర్ల బారిన పడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల విద్యార్థినులను సోమవారం పీడీఎస్‌వో జిల్లా కమిటీ ప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు కేజీహెచ్‌లో పర్యటించిన రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకు ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల బాలికల పాఠశాల, వసతి గృహ విద్యార్థినులను పచ్చకామెర్ల కారణంగా ఈ నెల 3, 4 తేదీల్లో కేజీహెచ్‌కు తీసుకొచ్చారన్నారు. సుమారు 129 మంది పచ్చకామెర్ల బారిన పడగా.. ఇప్పటికే ఇద్దరు మరణించారని, మిగతా విద్యార్థినులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. 600 మందికి పైగా విద్యార్థినులున్న ఈ పాఠశాలలో సరైన తాగునీరు లేకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని వైద్య వర్గాలు తెలుపుతున్నాయన్నారు. ప్రభుత్వ వైఫల్యానికి ఇది ఒక నిదర్శనమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌వో విద్యార్థి సంఘంగా డిమాండ్ చేస్తోందని తెలిపారు. విద్యార్థినులకు నాణ్యమైన వైద్యం అందించాలని కేజీహెచ్ వైద్యులను కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హోం మంత్రి హామీ ఇచ్చినట్లు లక్ష్మి తెలిపారు. పీడీఎస్‌వో జిల్లా కమిటీ సభ్యులు జానకి, తులసి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు



డాక్టర్ కాలేష బేగంను అభినందిస్తున్న ముస్లిం ప్రముఖులు

డాబాగార్డెన్స్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ముంబైలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్(ఏఎంపీ) జ్యూరీ సమావేశంలో విశాఖ చినగదిలి జిల్లా పరిషత్ హైస్కూల్ మ్యాథ్స్ అసిస్టెంట్ డాక్టర్ కాలేషా బేగం ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను హైదరాబాద్‌లో మకత్ ట్రస్ట్ చైర్మన్, సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. బాలికలకు విద్య, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు జాతీయ స్థాయిలో ఈ అవార్డు లభించింది. డాక్టర్ కాలేష బేగం వృత్తిపరంగా ఉపాధ్యాయునిగా తన బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రవృత్తిపరంగా కూచిపూడి నృత్యంలో పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇస్తూ, అనేక మందిని జాతీయ స్థాయి నృత్య పోటీలకు రాష్ట్రం నుంచి పంపించారు. అనేక పతకాలు సాధించిపెట్టారు. డాక్టర్ బేగం నిర్వహిస్తున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ట్రస్ట్ ద్వారా కెరీర్ గైడెన్స్, ఆర్ట్ అండ్ కల్చర్‌లో మార్గదర్శిగా ఉంటూ అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పెద్ద స్కాం

- వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవడమే లక్ష్యం
- దక్షిణ సమన్వయ కమిటీ సమావేశంలో సమన్వయకర్త వాసుపల్లి



మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన 17 వైద్య కళాశాలల స్థాపన చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఆశీల్‌మెట్టలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ శ్రేణులతో కలిసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, పీపీపీ విధానం సీఎం చంద్రబాబు స్కాంలో ఓ భాగమని ఆరోపించారు. నర్సీపట్నం మాకవరపాలెంలోని వైద్య కళాశాలకు జీవో లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పడం అవివేకమని మండిపడ్డారు. ఈ నెల 9న వైఎస్ జగన్ అక్కడికి వెళ్లినప్పుడు ఈ జీవో చూపించి, స్పీకర్ కళ్లు తెరిపిస్తామన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

9లోగా బూత్ కమిటీలు పూర్తి చేయండి

వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు అండగా నిలవాలని వాసుపల్లి కోరారు. ఆపరేషన్ లంగ్స్ పేరిట కూటమి పాలకులు విశాఖలో 42 వేల మంది చిరు వ్యాపారుల కడుపు కొట్టారన్నారు. దక్షిణ నియోజకవర్గంలో అనేక మంది చిరు వ్యాపారులు నష్టపోయారని, వారందరికీ హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. విశాఖ సంపదను అమరావతికి తీసుకుపోతున్నారని ఆరోపించారు. అధికార వ్యామోహంతో రెచ్చిపోతున్న కూటమి నేతలకు ప్రజలే త్వరలో బుద్ధి చెబుతారన్నారు. దక్షిణలో ఈ నెల 9లోగా బూత్ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని నాయకులకు వాసుపల్లి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అత్యంత హేయం



పాకా సత్యనారాయణ

అల్లిపురం: దేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి అత్యంత హేయమైన చర్యని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాక్షాత్తు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి పూనుకోవడం వెనుక పెద్ద కుట్ర ఉందని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన న్యాయవాదిని అనర్హుడిగా ప్రకటించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేంద్ర హోంమంత్రిని కోరారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలు ఏ ఉన్నత పదవిలో ఉన్నా.. వారికి గౌరవం దక్కడం లేదన్నారు. బీజేపీ వారు మత, కులపిచ్చితో అధికారంలోకి వచ్చారని, అప్పటి నుంచే దేశంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరగడం ప్రారంభమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ దాడులు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని పాకా హెచ్చరించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

ఇందిరానగర్‌లో అందరికీ ఇళ్ల పట్టాలివ్వండి

మహారాణిపేట: విశాఖ రూరల్ మండల పరిధిలోని ఇందిరానగర్‌లో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, గతంలో పట్టాలు ఇచ్చిన వారికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టాలని కోరుతూ స్థానికులు ఆందోళన చేపట్టారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 30 ఏళ్లుగా పాత డైరీఫారం వద్ద ఉన్న ఇందిరానగర్‌లో నివసిస్తున్నామని, తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు లేవని, ఇక్కడ 108 సర్వే నంబర్‌లో ఉన్న వారికి రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని, తమకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేవని చెప్పారు. కొంత మందికి ఎల్‌పీ నంబర్లు కూడా ఇచ్చారని, వివిధ కారణాలు చూపించి ఇక్కడ ఉన్న వారికి పట్టాలు ఇవ్వడం లేదని, తమకు కూడా పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఇందిరానగర్ వాసులు కోరారు.

వైభవంగా పసుపు దుర్గాదేవి నిమజ్జనం



విశేష అలంకరణలో పసుపు దుర్గాదేవి

డాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పసుపు దుర్గాదేవి నిమజ్జనం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బీఎంఎస్, బీపీఎంఎస్ అనుబంధ ఐఎన్‌సీ సంఘం గౌరవ అధ్యక్షుడు, విగ్రహ దాత పైలా దేముడు నాయుడు నేతృత్వంలో నేవల్ డాక్‌యార్డ్ సబ్‌మెరైన్ ఆక్సలరీస్ విభాగం వద్ద గత నెల 26న పసుపు దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. నేవల్ డాక్‌యార్డ్ చరిత్రలోనే తొలిసారిగా పసుపు దుర్గాదేవిని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పైప్ ఫిట్టింగ్ విభాగం నుంచి బయలుదేరిన నిమజ్జన ఊరేగింపు ఓల్డ్ డాక్‌యార్డ్ ఫింగర్ జెట్టీ వరకు సాగింది. అనంతరం దుర్గమ్మను సముద్రంలో నిమజ్జనం చేశారు. పైప్ ఫిట్టింగ్ విభాగం ఫోర్‌మేన్ జి.బంగారునాయుడు, కమిటీ సభ్యులు ఆడారి సంతోష్‌కుమార్, ఎస్ఏ స్వామి, బీఎంఎస్ యూనియన్ నాయకులు అల్లిపిల్లి నరసింహరాజు, ఆడారి రమేష్, చార్జ్‌మెన్లు పిల్లి సత్యనారాయణ, చంద్రశేఖర్, కృష్ణప్రసాద్, ఎంవీవీ సత్యనారాయణ, ఎల్.రామారావు, ఉమామహేశ్వరరావు, గౌరీశ్వరరావు, పి.ప్రకాష్, మధుసూదనరావు, పెద్ద ఎత్తున విభాగ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రోగుల సహాయకుల సుభోజనానికి విరాళం



కేజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న దాత బాలసుబ్రహ్మణియన్

మహారాణిపేట: టచ్‌స్టోన్ చారిటీస్, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో 14 ఏళ్లుగా రోగుల సహాయకులకు మూడు పూటలా భోజనాలు, అల్పాహారం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇండో ఎంఐఎం ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య ఆర్థిక అధికారి బాలసుబ్రహ్మణియన్ ఒక ఏడాది పాటు రోగుల సహాయకులను సుభోజనం కోసం విరాళమిచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 14 వరకు ఉచిత అన్నదానం కోసం ఆర్థిక సాయం అందజేశారు. ప్రతి రోజు 400 మంది రోగుల సహాయకులకు సుభోజనం కింద భోజనం, అల్పాహారం అందజేస్తున్నారు. కేజీహెచ్‌లో రోగులకు భోజనాలు పెడుతున్న ప్రాంతాన్ని సోమవారం బాలసుబ్రహ్మణియన్ సందర్శించారు. రోగుల సహాయకులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో మాట్లాడారు. 14 ఏళ్ల నుంచి సుభోజనం ద్వారా లక్షలాది మంది రోగుల సహాయకులు లబ్ధి పొందారన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్తదాసకు సుబ్రహ్మణియన్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీఎంఆర్‌డీఏ పార్కుల తోటమాలిలు

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో పనిచేసిన తోటమాలిలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వుడా వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు పాల్గొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు, సీఐటీయూ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ తోటమాలిలను విధుల నుంచి తొలగించి ఏడాది పూర్తయినా.. నేటికీ తిరిగి పనిలోకి తీసుకోలేదని, నష్టపరిహారం కూడా చెల్లించలేదన్నారు. దీనిపై కార్మిక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్మికులు 30 ఏళ్లుగా వీఎంఆర్‌డీఏ పార్కుల్లో పనిచేస్తున్నారని, వారికి ఎటువంటి పరిహారాలు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని వెంకటరావు ప్రశ్నించారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు సిహెచ్.రాంబాబు, దేవాడ నరసింగరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.